క్లుప్తంగా

10న గంధ మహోత్సవం



గంధోత్సవానికి ముస్తాబవుతున్న దర్గా

ఉదయగిరి: పట్టణంలోని కోనకాలువ సమీపంలో కొలువైన హజరత్ సయ్యదినా మహబూబ్ సుభానీ గంధమహోత్సవం ఈ నెల10న జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ రాత్రి 11 గంటలకు మహబూబ్ సాహెబ్ ఇంటి వద్ద నుంచి గంధం పకీరుల జరబులు, బాణసంచా సందడితో బయలుదేరి దర్గా చేరుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనలు, చదివింపుల అనంతరం భక్తులకు గంధాన్ని పంచి పెడతారన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 12న తహలిల్ ఫాతేహతో గంధోత్సవం ముగుస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



చింతలపల్లి సుధాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరుకు చెందిన పుచ్చలపల్లి సుధాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పుచ్చలపల్లి కవితమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు బజార్లో సబ్సిడీతో ఉల్లి విక్రయాలు



ఉల్లి విక్రయాలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్, ఎస్టేట్ ఆఫీసర్ తదితరులు

కావలి: పట్టణంలోని రైతుబజార్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కిలో ఉల్లి రూ.40లకే అమ్మకాలను ఆదివారం ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్ ప్రారంభించారు. జెడ్పీటీసీ జంపాని రాఘవులు, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ డీ స్వరూపరాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గుడ్లూరు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



తిరుపతి రుయా ఆస్పత్రిలో శివారెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు కల్పన

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆత్మకూరు పట్టణం 9వ వార్డు నాగేంద్రపురానికి చెందిన చలమల శివారెడ్డి డయాలసిస్ పేషెంట్. కొద్ది రోజులుగా తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో స్థానిక వలంటీరు కంది కల్పన ఆదివారం తిరుపతికి వెళ్లి రుయా ఆస్పత్రిలో శివారెడ్డికి పింఛన్ అందజేసింది.

ప్రజారక్షణ భేరి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి: ఈ నెల 15న సీపీఎం ఆధ్వర్యంలో జరగనున్న ప్రజారక్షణ భేరిలో భాగంగా నిర్వహించే ఛలో విజయవాడ కార్యక్రమం వాల్‌పోస్టర్లను నాయకులు ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఆవిష్కరించారు. నాయకులు ఫరిద్దీన్‌బాషా మాట్లాడుతూ వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ప్రజారక్షణ భేరిలో అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండగానిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు కె.విజయమ్మ, నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సారథ్యంలో సామాజిక అభ్యున్నతి సాధ్యం

- 53 నెలల పరిపాలనతో ఆచరణలో చూపించారు
- ఈ నెల 9న కావలిలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారిత బస్సు యాత్ర
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక అభ్యున్నతికి పెద్ద పీట వేశారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గడిచిన 53 నెలల పరిపాలన ద్వారా ఆచరణలో చూపించారన్నారు. ఈ నెల 9న కావలిలో 'సామాజిక సాధికార' వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర జరుగుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. కావలిలోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడా కేవలం నినాదాలుగానే మిగిలిపోయిన సామాజిక సాధికారత, బడుగులకు రాజ్యాధికారాన్ని సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోమోహన్‌రెడ్డిదని చెప్పారు. 70 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాజికంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పించి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపిస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలబడి 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి వైఎస్ జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేయాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు డిప్యూటీ సీఎం పదవులతో పాటు పూర్తి అధికారాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్, నామినేటెడ్ పదవుల్లో చరిత్రలో మరే సీఎం చేయని విధంగా అధిక శాతం పదవులు ఇచ్చారన్నారు. నలుగురు బీసీలను సీఎం జగన్ రాజ్యసభకు పంపడం విశేషమన్నారు.

సాధికార యాత్ర రూట్ మ్యాప్

- ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు అల్లూరు మండలం ఇస్కపల్లిలో శివాలయంలో పూజల అనంతరం సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమవుతోంది.
- అక్కడి నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాదయాత్రగా బయలుదేరి శంభునివారిపాళెం పాతపాళెం మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు తాటిచెట్లపాళెం వరకు కొనసాగుతోందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు.
- అక్కడి నుంచి బస్సుయాత్ర బోగోలు మండలంలో ఆర్‌ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలకు 12.30 గంటలకు చేరుకుంటుంది.
- కళాశాలలో వ్యాపారస్తులు, డాక్టర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు తదితర వివిధ రంగాల వృత్తి నిపుణులతో ఆత్మీయ సమ్మేళనం ఉంటుంది.
- అనంతరం బస్సుయాత్ర జాతీయ రహదారి మీదుగా కావలి పట్టణంలోని ఉత్తర శివారు ప్రాంతం మద్దూరుపాడు వద్ద మధ్యాహ్నం 3 గంటలకు కావలి పట్టణంలోకి ప్రవేశిస్తోందని వివరించింది.
- పట్టణంలో జెండాచెట్టు వద్ద బస్సు యాత్రకు స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికే కార్యక్రమం జరుగుతుంది.
- అనంతరం అక్కడే ఉన్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, దర్గాలో ప్రత్యేక పూజలు చేసి, పాదయాత్రగా బయలుదేరి ట్రంక్‌రోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహం కూడలిలో సభ జరుగుతుంది.
- వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో మంత్రులు సీదిరి అప్పలరాజు, జోగి రమేష్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, జూపూడి ప్రభాకర్‌రావు ప్రసంగిస్తారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని కావలి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు, ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు, దివంతగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చేశారు.

జర్నలిస్ట్‌లకు ఇచ్చిన మాట కూడా నిలబెట్టుకున్న జగనన్న

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

కావలి: ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొందుపరిచిన, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయింపునకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలపడం హర్షణీయమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు జర్నలిస్టులు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యేను ఆయన నివాసంలో జర్నలిస్టులు కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులకు 3 సెంట్లు ఇంటి స్థలం ప్రభుత్వం ఇవ్వడానికి చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. కావలిలోని జర్నలిస్టులకు ఇప్పటికే తాను ఇంటి స్థలాలు ఇచ్చానని, వాటిలో సత్వరమే ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో జర్నలిస్టులు నిర్వహించిన పాలాభిషేకంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఆర్డీఓ తనిఖీ



సోమశిల: బీఎల్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ కురబ మధులత



పోలింగ్‌బూత్ వద్ద ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున

మర్రిపాడు: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపును ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత తనిఖీ చేశారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సన్నువారిపల్లి, మర్రిపాడు, చుంచులూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు ఆనందరావు, ఆర్‌ఐ సురేంద్ర తదితరులు ఉన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలంలోని మంచాలపల్లి, ఉప్పలపాడు, చాపురాళ్లపల్లి, అనంతసాగరం పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆర్డీఓ కురబా మధులత తనిఖీ చేశారు. గ్రామాల్లో ఓట్ల నమోదు చేసుకునే వారికి బీఎల్‌ఓలు ముందస్తు సమాచారం ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. ఆమె వెంట తహసీల్దారు వై సుభాషిణి ఉన్నారు. మండలంలోని లింగంగుంట, దేవరాయపల్లి, మినగల్లు, రేవూరు, ఇస్కపల్లి, కొత్తపల్లి పోలింగ్ కేంద్రాలను ఎంఈఓ కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.

సంగం: మండలంలోని పలు పోలింగ్‌ల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంప్‌ను తహసీల్దారు నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు అందజేశారు.

బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలి

వరికుంటపాడు: మండలంలోని బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలని తహసీల్దార్ ఎస్.మల్లికార్జున అన్నారు. ఆదివారం మండలంలో జరిగిన పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్వోలకు తగు సూచనలందించారు. ప్రత్యేక ఓటరు నమోదులో బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మోస్తరు వర్షం



సంగం: భారీ వర్షం కురుస్తున్న దృశ్యం



వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై రోడ్లపై ప్రవాహం

సంగం: ఈశాన్య రుతుపవనాలతోకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం మండలంలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపాతం తక్కువగా నమోదై ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతన్నకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది.

ఉదయగిరిలో..

ఉదయగిరి: పట్టణంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ప్రారంభమైన వర్షం అర గంటపాటు కురిసింది. వర్షానికి తోడు చలిగాలులు కూడా తోడవడంతో వృద్ధులు, చిన్నారులు, ఇబ్బందులు పట్టారు. పట్టణంలో వర్షపు నీటితో పాటు మురుగునీరు ఏకమై రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు

యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న శేషులు

వరికుంటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఆదివారం యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, శేషులు, జీవీ చలపతిశర్మ మాట్లాడారు. పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, 1వ తేదీనే జీతాలు చెల్లించాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈసమావేశంలో నాయకులుచంద్రశేఖరరెడ్డి, బాల రాగయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరిని బెదిరించి..

వరికుంటపాడు: మండలంలోని విరువూరు శివారులో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాపరిని బెదిరించి గొర్రెల ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. గ్రామానికి చెందిన బత్తల వెంకటరమణ జీవాలను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శనివారం రాత్రి గ్రామ శివారులో జీవాలను ఉంచి అక్కడే కాపలాగా పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ముఖాలకు ముసుగులు ధరించిన కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు వెంకటరమణ దగ్గరకు వెళ్లి గొంతుపై కత్తి పెట్టి బెదిరించి అరవకుండా నోటికి గుడ్డకట్టారు. గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో పామూరు నుంచి విరువూరు వైపు బైక్‌లు వస్తుండడం గమనించి వారు పరారైనట్లు తెలిసింది. బాధితుడు వరికుంటపాడు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఎవరూ లేకపోవడంతో అప్రమత్తంగా ఉండాలని యజమానికి సూచించారు.

నేడు బ్రాహ్మణపల్లిలోనే ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ప్రజలు ఆయన్ను సంప్రదించవచ్చునని తెలిపారు.

సేవాతత్పరుడికి నంది అవార్డు



అక్కినేని అవార్డును అందుకుంటున్న పాదర్తి నాగరాజు

కావలి: హైదరాబాద్‌లోని వంశీ (బర్కిలీ) ఇంటర్నేషనల్, కళా నిలయం సాంస్కృతిక సంఘం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు పురస్కరించుకుని కావలికి చెందిన పాదర్తి నాగరాజుకు నంది అవార్డు ప్రదానం చేశారు. సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పాదర్తికి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వంశీ రామరాజు, దైవజ్ఞశర్మ, శంకరాభరణం మూవీ ఝాన్సీ, ప్రముఖ సీనియర్ నటి శ్రీమతి కృష్ణకుమారి, సుడి గుండాలు మూవీ సంధ్యారాణి, జబర్దస్త్ అప్పారావు, ప్రముఖ దర్శకులు అల్లాని శ్రీధర్, సీనియర్ నటులు కత్తి కాంతారావు తనయుడు రాజా తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



జగన్‌మోహన్ రావు (ఫైల్)

కావలి: పట్టణంలోని మూర్తిశెట్టి వారి వీధికి చెందిన అలహరి జగన్‌మోహన్‌రావు (60) వృద్ధాప్యంతో మరణించగా, కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సహకారంతో నేత్రాలను దానం చేశారు. నెల్లూరు మోడరన్ కంటి ఆస్పత్రి సిబ్బంది కార్నియాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, జగన్మోహన్‌రావు కుమారుడు సాయికుమార్, కుటుంబ సభ్యులు అలహరి సుబ్బారావు, సాయిసుమంత్ తదితరులు పాల్గొన్నారు.



పెగళ్లపాడు నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో మండలంలోని పెగళ్లపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అల్పాహార విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మేకపాటి నియోజకవర్గంలో ఒక్కో గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. పెగళ్లపాడు నాయకులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో కె.కొండారెడ్డి, చెవుల శ్రీనివాసులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మేకపాటికి గ్రామాభివృద్ధికి సంబంధించి పలు విషయాలను చర్చించారు. ఎమ్మెల్యే త్వరలో జరగబోయే రెవెన్యూ సదస్సులో మండలంలోని పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేసుకుంటామన్నారు.

రైతుల్లో చిగురించిన ఆశలు

చేజర్ల: మూడు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో తొలి పంట (రబీ)పై ఆశలు చిగురిస్తున్నాయి. పక్కనే సోమశిల జలాశయం ఉన్నా.. అందులో 30 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉండడం, వర్షాలు కురవకపోవడంతో రబీపై రైతుల్లో నిరాశ నెలకొంది. ఈ పరిస్థితుల్లో నార్లు పోసుకొనేందుకు రైతులు జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలో రోజూ చిరు జల్లులు పడుతుండడంతో రైతుల్లో ఆశలు బలపడ్డాయి. ఈ వర్షాలు బలపడి మరో నాలుగు రోజులు కొనసాగితే నార్లు పోసుకోవాలనే ఆశతో ఉన్నారు. జిల్లాలో నవంబర్ మొదటి, రెండో వారాల్లో వర్షాలు పడడం ఆనవాయితీగా వస్తోంది. ఆశాజనకంగా వర్షాలు కురుస్తాయనే నమ్మకం రైతుల్లో ఉంది. రైతులంతా తొలి పంట పైనే నమ్మకం పెట్టుకున్నారు. ఖరీఫ్‌లో ధాన్యం ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు మంచి ధరకే ధాన్యం అమ్ముకున్నారు. రెట్టింపు ఉత్సాహంతో రబీపై ఆశలు పెంచుకున్నారు. చేజర్ల మండలంలో దాదాపు 9 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ప్రస్తుతానికి సుమారు 100 ఎకరాల్లోపే బోర్ల కింద నార్లు పోశారు. ఎక్కువ భాగం సోమశిల ప్రాజెక్ట్ కాలువ నీటిపైనే ఆధారపడి ఉన్నారు. అయితే వర్షాల రాక కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిస్తే తొలి పంటకు సమాయత్తమవుతున్నారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషాచారి



మాట్లాడుతున్న జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషాచారి

సంగం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజనకు అర్హులైన విశ్వ బ్రహ్మణులందరూ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విశ్వ బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషాచారి తెలిపారు. ఆదివారం సంగంలోని వెంకటేశ్వరకల్యాణ మండపంలో మండల స్థాయి విశ్వబ్రహ్మణ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యోజనలో 18 రకాల చేతి వృత్తుల్లో వడ్రంగి, స్వర్ణకార, కొలిమి, వెల్డింగ్, శిల్పకళ, టైలరింగ్ తదితరాలు ఉన్నాయని, ఈ పథకంలో నూతన సాంకేతికత కోసం శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో స్టైఫండ్ ఉంటుందని తెలిపారు. వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వ ఆర్థిక సహాయం కూడా ఉంటుందన్నారు. మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమవరం శివరామాచారి, ప్రధాన కార్యదర్శిగా పైడా కృష్ణయ్యాచారి, ఉపాధ్యక్షుడు బొల్లోపల్లి మాల్యాద్రాచారి పలువురు సభ్యులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ బాధ్యులు

కావలి: పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'చెకుముకి సైన్స్' సంబరాలు 2023–24 పోస్టర్‌ను ఆదివారం స్థానిక రవి నర్సింగ్ హోమ్‌లో ఆవిష్కరించారు. కావలి పట్టణ జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుటకు చెకుముకి సంబరాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జేవీవీ కృషి చేస్తోందన్నారు. తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు నాలుగు స్థాయిల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. నవంబర్ 10న పాఠశాల స్థాయి, 30 మండల/పట్టణ స్థాయి, జిల్లాస్థాయి డిసెంబర్ 17, 2024 జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరుగుతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ జేవీవీ ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరామ్, జి.కళ్యాణి, ఉపాధ్యక్షులు శ్రీకర్ల వెంకయ్య, ఓ. ఖాదర్ బాషా, ఓ. హరినారపరెడ్డి, ఇ. కల్లయ్య, కార్యదర్శులు సీహెచ్ శారద, గాదిరెడ్డి. మురళీకృష్ణ, ఓ. జాన్ తదితరులు పాల్గొన్నారు

దోషులను కఠినంగా శిక్షించాలి



ఆత్మకూరులో హిందూ ఐక్య వేదిక ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరులో నివాసం ఉంటూ అయ్యప్ప స్వామి మాలధారణలో ఉన్న రౌతు వినయ్ అనే యువకుడిపై దాడి చేసి అవమానించిన నిందితులను కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. కొందరు ముస్లిం యువకులు విచక్షణా రహితంగా పోలీసుల ఎదుటనే దాడికి పాల్పడి తీవ్రంగా అవమానించారని, దీంతో వినయ్ మరుసటి రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, తదితర సంఘాల హిందూ ఐక్య వేదికగా ఏర్పడి ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న యువకుడిపై దాడికి పాల్పడుతుంటే అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకుల్లాగా చూస్తూ ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ఆ పోలీసులను సస్పెండ్ చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్త ఆందోళనలు చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అనంతరం పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

పేదలకు చీరల పంపిణీ



గిరిజన మహిళలకు చీరలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు

ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకు పట్టణంలోని 8, 9 వార్డుల పరిధిలోని గిరిజన కాలనీల్లో 7వ వార్డు కౌన్సిలర్ నౌషాద్ బేగం, సయ్యద్ జమీర్ దంపతులు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి ఆదివారం సాయంత్రం ఆ కాలనీల్లో గిరిజన మహిళలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, శివకోటారెడ్డి, కామాక్షయ్య నాయుడు, టి తిరుపతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కె చిన్నపరెడ్డి, కొండా చిన్న వెంకటేశ్వర్లు, ముజీబ్, చైతన్య, తుపాకుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.